నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

మహబూబ్‌నగర్

నారాయణపేట

మంగళవారం 19 డిసెంబర్ 2023 | TUESDAY, DECEMBER 19, 2023 | MAHABUBNAGAR NARAYANPET | పేజీలు PAGES : 8




వెల్దండ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులు



పీఎస్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల

- వెల్దండలో అడ్డుకున్న పోలీసులు
- పోలీస్ స్టేషన్‌కు తరలింపు.. రెండు గంటలపాటు అక్కడే..
- వందలాదిగా బీఆర్ఎస్ శ్రేణుల రాక
- పీఎస్ ఎదుట బైఠాయింపు
- పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట
- హైదరాబాద్‌కు తరలింపు
- కాంగ్రెస్‌ది ఇంత అరాచకమా..? : మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

8

# గువ్వల నిర్బంధం

దైవ కార్యానికి హాజరయ్యేందుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజును పోలీసులు నిర్బంధించారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి లింగాల మండలం అంబటిపల్లిలో జరిగే ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు వెళ్తున్న గువ్వల వాహన శ్రేణిని వెల్దండ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. గువ్వలతోపాటు ఆయన సతీమణి అమలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాదాపు రెండు గంటల పాటు అక్కడే ఉంచడంతో ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు వందలాదిగా పీఎస్ వద్దకు చేరుకొని బైఠాయించారు. గువ్వలను రాష్ట్ర రాజధానికి తరలించేందుకు బయటకు తీసుకురావడంతో పార్టీశ్రేణులు అడ్డు తగిలారు. దీంతో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకున్నది. అనంతరం కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి గువ్వల దంపతులను పోలీస్ వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు. అంతకు ముందు గువ్వల మాట్లాడుతూ కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ సొంత నియోజకవర్గంలో ఇంత అరాచకమా.. అంటూ ధ్వజమెత్తారు.

- వెల్దండ, డిసెంబర్ 18

- రైతులు విస్తుపోయేలా పెట్టుబడి సాయం
- ఒకరికి రూ.1, మరొకరికి రూ.62 జమ
- పాలమూరు జిల్లాలోని రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్

సెంటర్ స్ప్రెడ్‌లో..

# ఇదేం చోద్యం!



ఖాతాలో రూ.62 జమైనట్లు వచ్చిన మెసేజ్‌ను చూపిస్తున్న రైతు ఆంజనేయులు

- ఖాతాల్లో జమైన డబ్బు చూసి కర్షకుల అవాక్కు
- చెప్పింది కొండంత.. చేసేది గోరంత అంటూ అసహనం
- రేవంత్ సర్కారు ఘనకార్యంపై ఆగ్రహం

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'చెప్పేది కొండంత.. చేసేది గోరంత' అన్న నానుడి మాటను నిజం చేస్తున్నది. యాసంగి పంట పెట్టుబడికి వారిచ్చే రైతుబంధు సాయాన్ని చూసి కర్షకులు విస్తుపోతున్నారు. నాలుగు రోజులుగా రేవంత్ సర్కారు అందిస్తున్నది కేవలం అరకొర సాయమే.. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ రైతుకు ఒక్క రూపాయి జమ కావడం సంచలనం కలిగిస్తున్నది. చెప్పిన మూడ్రోజుల తర్వాత రైతుబంధు డబ్బులు పడ్డట్టు సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ చూసి ఓ రైతు అవాక్కయ్యాడు. హన్వాడకు చెందిన పాండురంగారెడ్డి అనే రైతుకు అక్షరాలా ఒక్క రూపాయి పడడంతో ఖంగుతిన్నాడు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండుసార్లు ఎకరాకు రూ.10 వేల చొప్పున పడేదని, ఐదెకరాల పొలం ఉండి రూపాయి మాత్రమే పడడంతో బిత్తరమొఖం వేయడం సదరు రైతు వంతైంది. అలాగే టంకరకు చెందిన మరో రైతు ఆంజనేయులుకు సైతం రూ.62 జమైనట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. తనకు రెండుగుంటల భూమి ఉండగా. గతంలో రూ.250 పడేదని చెప్పుకొచ్చాడు. కాంగ్రెస్ ప్రభుత్వ ఘనకార్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై పెట్టుబడికి అప్పులు చేయడం తప్పదని వాపోయారు.

- మహబూబ్‌నగర్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- కాంగ్రెస్ పార్టీ ఆగం చేసిందన్న ఆటో యూనియన్లు
- ఉపాధి చూపించాలని డిమాండ్
- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : సీఐటీయూ నేతలు
- ప్రభుత్వం ఆదుకోవాలి : శ్రీనివాస్‌గౌడ్

# ఆటోవాలా ఆగ్రహం

- ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల నిరసనలు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో బతుకు బండి కుదేలంటూ ఆందోళన
- రోడ్డున పడతామని ఆటో డ్రైవర్ల ఆవేదన

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం తమ ఆదాయానికి గండికొట్టిందని ఆటోవాలాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టగా.. జడ్చర్ల, దేవరకద్రలో ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మా జీవితాలను ఆగం చేసిందంటూ పలువురు ఆగ్రహం వెలిబుచ్చారు. తమకు ఉపాధి కల్పించి ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు.

- నాగర్‌కర్నూల్/దేవరకద్ర/జడ్చర్ల టౌన్, డిసెంబర్ 18

సెంటర్ స్ప్రెడ్‌లో..





నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోవాలాలు, యజమానులు, సీఐటీయూ నాయకులు